క్లుప్తంగా

మిశ్రమ పంటలపై ఆసక్తి




తామరఖండిలో పామాయిల్ తోటలో మిశ్రమ పంటగా పత్తి

సీతానగరం: సంప్రదాయ పద్ధతుల్లో ఒక పంట సాగు చేసే రైతులు నేడు మిశ్రమ పంటల వైపు దృష్టి సారిస్తున్నారు. ఒక పంట పోయినా మరో పంట ఆదుకుంటుందనే నమ్మకం.. వ్యవసాయాధికారుల ప్రోత్సాహంతో రైతులు పామాయిల్ తోటల్లో పత్తి, మొక్కజొన్న, అరటి, నువ్వు వంటి అదనపు పంటలు సాగు చేస్తున్నారు. ఈ మేరకు తామరఖండి, గెబ్బలుప్పి, బళ్ళకృష్ణాపురం, దయానిధిపురం, చినంకలాం, జానుమల్లువలస, అప్పయ్యపేట, అంటిపేట, వెంకటాపురం గ్రామాల్లో సుమారు 250 ఎకరాల విస్తీర్ణంలో మిశ్రమ పంటలు సాగు చేస్తున్నారు. అలాగే 150 ఎకరాల్లో చోడి, కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు.

గిరిజన పాఠశాలల ఉపాధ్యాయులకు అన్యాయం

పార్వతీపురం టౌన్: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికలో గిరిజన పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందని గిరిజన విద్యార్థి సంఘ అధ్యక్షుడు పల్ల సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఎంపిక చేయడం విచారకరమన్నారు. ఉన్నతాధికారులు ఈ విషయమై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబి వేడుకలు



పట్టణంలో ముస్లిం సోదరుల ర్యాలీ

పార్వతీపురం టౌన్: మిలాద్ ఉన్ నబి పండుగ వేడుకలు ముస్లిం సోదరులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. మత గురువు షరీఫ్‌ఖాన్ రబ్బాని ఆధ్వర్యంలో పట్టణ ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మతగురువు ఖాన్ రబ్బాని మాట్లాడుతూ.. మహ్మద్ ప్రవక్త చూపిన మార్గమే స్వర్గలోకానికి రాజమార్గమన్నారు. కార్యక్రమంలో మహ్మద్ జలాల్, షేక్ షఫీ, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

గోశాల కాదు పాఠశాలే..



అదనపు పాఠశాల భవనంలో పశువులు

సాలూరు: పక్క చిత్రంలో చూస్తున్నది గోశాల కాదు.. పాఠశాలే. పశువులున్న ఈ భవనం బోనువీధి సమీపంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన గది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ' మనబడి నాడు – నేడు' కార్యక్రమంలో భాగంగా విద్యావ్యవస్థకు నూతన జవసత్వాలు అందించారు. ఈ క్రమంలో ఈ పాఠశాలకు అదనపు భవనాలు మంజూరు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ భవనాలను పూర్తి చేయలేకపోయారు. దీంతో అసంపూర్తిగా నిలిచిన ఆ భవనాలు ప్రస్తుతం పశువులకు ఆవాసాలుగా మారాయి. అంతేకాకుండా కొందరు ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు ఈ భవనాన్ని వినియోగిస్తున్నారు. అధికారులు స్పందించి భవనాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

నేడు గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన సదస్సు

గరుగుబిల్లి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై శనివారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రజని ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా రెండో అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సెల్ అధ్యక్షులు ఎస్.దామోదర్‌రావు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపేలా మంచి, చెడు స్పర్శలపై చైతన్యం చేయడం జరుగుతుందన్నారు.

ఈ ఎత్తుగడ ఎందుకో..?

- బడిదేవరకొండ మైనింగ్‌పై మళ్లీ మొదలైన రాజకీయం
- తవ్వకాలు నిలిపివేయాలన్న ఎమ్మెల్యే
- ఆందోళనలు చేసినప్పుడు రాని ఎమ్మెల్యే ఇప్పుడు రావడం వెనుక మర్మమేమిటో..



మైనింగ్ వల్ల కిందకు చేరిన రాతి బుగ్గి

పార్వతీపురం రూరల్:

బడిదేవర కొండను సుమారు 20 పంచాయతీల ప్రజలు దైవంగా భావిస్తారు. కొండపై మేఘాలు వచ్చాయంటే అమ్మ దయతో వర్షాలు పడతాయని ఇక్కడి ప్రజల నమ్మకం. ఇటువంటి కొండపై గ్రానైట్ తవ్వకాలకు ప్రభుత్వం ఏడాది కిందట ఓ ప్రైవేట్ కంపెనీకి మైనింగ్‌కు అనుమతిచ్చింది. దీంతో ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు ఎన్నో ఆందోళనలు చేశారు. నిరసన కార్యక్రమాలు చేపట్టి మైనింగ్ నిలిపివేయాలని కోరారు. కనబడిన ప్రతి అధికారికీ, ప్రజా ప్రతినిధికీ వినతిపత్రాలు అందజేశారు. ప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని మైనింగ్ ఆపాలన్నా ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. దీంతో సమీప ప్రాంత ప్రజలు చేసేది ఏమీ లేక మిన్నకుండిపోయారు. ఈ తరుణంలో కొద్ది రోజుల కిందట ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తన అనుచరులను వెంటబెట్టుకుని కొండ వద్దకు వచ్చి మైనింగ్ ఆపేయాలంటూ పట్టుబట్టారు. మరోసారి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. పిలిచినప్పుడు రాని ఎమ్మెల్యే ఇప్పుడెందుకు వచ్చినట్లు.. ఈ ఎత్తుగడ ఎవరి కోసం అని ప్రజలు ఆలోచనల్లో పడ్డారు.

అప్పుడేమి చేశారు..

బడిదేవర కొండపై మైనింగ్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వకూడదంటూ ప్రజా సంఘాలు, స్థానిక గిరిజనులు పోరాటం చేసే క్రమంలో స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు సమాచారం ఇచ్చినా సహకరించలేదు. ఇప్పుడు హఠాత్తుగా రావడంపై ప్రజా సంఘాల నాయకులు, జనసేన నాయకులు దుమ్మెత్తి పోస్తున్నారు. దీని వెనుక ఏదో మర్మం ఉందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవల బడిదేవరకొండ చెరువుకు చేపల వేటకు వెళ్లి ములగ గ్రామానికి చెందిన పాడి బంగారి దొర మైనింగ్ వల్ల ఏర్పడిన గోతుల్లో పడి మృతి చెందారు. అప్పుడు కూడా ఎమ్మెల్యే నుంచి ఎటువంటి స్పందనా రాలేదు.

లైసెన్స్ రద్దు చేయాలి..



తక్షణమే బడిదేవరమ్మ కొండపై మైనింగ్ లైసెన్స్ రద్దు చేయాలి.తవ్వకాల వల్ల టన్నుల కొద్దీ రాతిబుగ్గి ఏర్పడి దిగువ ప్రాంతాలకు చేరుతోంది. పంటలు పండడం లేదు. ప్రజా ప్రతినిధులు, పాలకులు స్పందించి మైనింగ్ నిలిపివేయాలి.

– ఎం. కృష్ణమూర్తినాయుడు, జిల్లా రైతుసంఘ అధ్యక్షుడు, పార్వతీపురం మన్యంజిల్లా

మహాసభలను విజయవంతం చేయండి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ

పార్వతీపురం టౌన్: ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ ప్రథమ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్వతీపురం గిరిజన సామాజిక భవనంలో ఆదివారం మహాసభలు నిర్వహిస్తామన్నారు. 20 సంవత్సరాలుగా అనేక కష్టాలకోర్చి ఫీల్డ్ అసిస్టెంట్లు విధులు నిర్వహిస్తున్నా సరైన గుర్తింపు లేకపోవడం విచారకరమన్నారు. ఉన్నత విద్యార్హతలున్న ఎంతోమంది ఇందులో పనిచేస్తున్నా కేవలం ఆరు వేల రూపాయల వేతనంతో వారి శ్రమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోచుకుంటున్నాయని ఆరోపించారు. దీనికి తోడు సోషల్ ఆడిట్ పేరుతో సాంకేతిక కారణాలను సాకుగా చూపించి లక్షల రూపాయల రికవరీలు చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఐకమత్యంతో పోరాడినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. మహాసభలకు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వి. ఉమామహేశ్వరరావు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మండంగి హరనాథ్, సంఘ నాయకులు పోతుల రామారావు, లాడి దుర్గారావు, ఊల్ల నాగరాజు, అప్పల నాయుడు, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత నీరివ్వండి..



నేలబావి వద్ద నిరసన తెలియజేస్తున్న గ్రామస్తులు

పార్వతీపురం రూరల్: మండలంలోని జమదాల పంచాయతీ పొట్టిగదబవలస గ్రామానికి సురక్షిత నీరు సరఫరా చేయాలని ప్రజలు కోరారు. ఈ మేరకు సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1945లో తీసిన నేలబావి నీటినే నేటికీ వినియోగిస్తున్నామని చెప్పారు. ఆ నీటి వల్ల చర్మ వ్యాధులు, అనేక రోగాలు వస్తున్నాయని తెలిపారు. అధికారులు, పాలకులు స్పందించి గ్రామానికి సురక్షిత నీరు సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల అధ్యక్షుడు పి.రాము, వరాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్‌కు జన్మదిన శుభాకాంక్షలు



జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: జెడ్పి చైర్మన్, భీమిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావుకు (చిన శ్రీను) మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు విజయనగరంలోని జెడ్పీ కార్యాలయానికి శుక్రవారం వెళ్లి శ్రీనివాసరావుకు పూలబొకే అందజేసి అభినందించారు. ఆయన వెంట నియోజకవర్గ నాయకులు, అభిమానులున్నారు.

అశుతోష్‌నే కొనసాగించాలి..

- గిరిజన సంఘాల డిమాండ్

పార్వతీపురం రూరల్: సబ్ కలెక్టర్‌గా, పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓగా పనిచేసిన అశుతోష్ శ్రీవాత్సవకు ఇటీవలే బదిలీ అయిన విషయం విదితమే. ఈ మేరకు తాజాగా ఆయనకు గుంటూరు సంయుక్త కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇదిలా ఉంటే ఆయన ఐటీడీఏ పీఓగా విశేష సేవలందించారు. గిరిజన సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో వ్యవహరించారు. దీంతో గిరిజన ప్రాంత అభివృద్ధికి ఆయన సేవలు అవసరమని భావించిన గిరిజన సంఘాలు ఆయననే పీఓగా కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ మేరకు కురుపాం, గుమ్మలక్ష్మీపురం, తదితర ప్రాంతాలకు చెందిన 50 మంది గిరిజన సంఘ నాయకులు శుక్రవారం సాయంత్రం పార్వతీపురం చేరుకుని అశుతోష్ శ్రీవాత్సవను కలిసి ఇక్కడే ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని, తామెక్కడున్నా గిరిజనుల సంక్షేమం కోసం పనిచేస్తానని ఆయన నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అందుకు అంగీకరించని గిరిజన సంఘాల నాయకులు ఈ విషయమై కురుపాం ఎమ్మెల్యేపై ఒత్తిడి తీసుకువచ్చి, బదిలీ నిలుపుదల చేయడానికి ప్రయత్నించాలని నిర్ణయించుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పార్వతీపురం రూరల్: మండలంలోని తాళ్లబురిడి సబ్‌స్టేషన్ పరిధిలో గల డీకే పట్నం, గంగాపురం 11 కేవీ ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని ఏఈ పి. రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు తాళ్లబురిడి, డీకేపట్నం, డోకిశీల, గోచెక్క, గంగాపురం, కోరి, ములగ గ్రామాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు సాగునీటి సరఫరా బంద్

సాలూరు: మున్సిపాలిటీ పరిధిలో శనివారం తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని మున్సిపల్ కమిషనర్ రత్నకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెడ్‌వాటర్ వర్క్స్‌కు వచ్చే ఎలక్ట్రికల్ మెయిన్‌లైన్ బ్రేక్‌డౌన్ కారణంగా నీటి సరఫరా నిలిచిపోనుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

హిందీ టీచర్‌ను నియమించండి

గరుగుబిల్లి: మండలంలోని పెదగుడబ పంచాయతీ, సన్యాసిరాజు ప్రాథమికోన్నత పాఠశాలకు హిందీ టీచర్‌ను నియమించాలని గ్రామస్తులంతా కోరుతున్నారు. ఇదే పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు 105 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా వారికి హిందీ సబ్జెక్ట్ బోధించే ఉపాధ్యాయుడు లేకపోవడంతో విద్యార్థులంతా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల డీఎస్సీ కూడా జరిగిందని, కొత్తగా ఎంపికైన హిందీ టీచర్లలో ఒకరిని గ్రామానికి పంపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వాడవాడలా అన్నసంతర్పణలు



అన్నసమారాధనలో పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సుమారు నాలుగు వేల మంది భక్తులు పాల్గొని స్వామి ప్రసాదం స్వీకరించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చెలికాని వెంకటగోపాలకృష్ణ, కార్యదర్శి కన్నారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే సుంకరివీధి, గూడెం వీధిలో కూడా అన్నదానాలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్. హరిగోపాలరావు, అరవింద్‌కుమార్, ఎస్ ప్రసాద్, మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మామిడిపల్లిలో..

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లిలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులకు మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సువ్వాడ గుణవతి, సువ్వాడ రామకృష్ణ ,దండి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

రహదారులే వాటి ఆవాసాలు..



అంతర్రాష్ట్ర రహదారిపై వాహనాలకు అడ్డంగా తిష్ట వేసిన పశువులు



ఆస్పత్రి జంక్షన్ సమీపంలో పందుల గుంపు



పట్టణ ప్రధాన రహదారిపై కుక్కల సంచారం

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలోని అంతర్రాష్ట్ర రహదారిపై పగలు, రాత్రి అనే తేడాలేకుండా పశువులు, పందులు, కుక్కలు సంచరిస్తూ బాటసారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. పశువులు వాహన రాకపోకలకు అంతరాయం కలిగిస్తుంటే.. కుక్కలు, పందులు వాహనదారులు, పాదచారులను భయపెడుతున్నాయి. ఇప్పటికే కుక్కల దాడిలో పలువురు గాయపడిన సందర్భాలు కూడా ఉన్నాయి. అధికారులు స్పందించి పశువులు, పందులు, కుక్కలు రోడ్లపై సంచరించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



మక్కువ: కేజీబీవీలో రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మక్కువ: మండలంలోని కాశీపట్నం కేజీబీవీలో ప్రత్యేకాధికారి జి.నాగదుర్గ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి నాగదుర్గ మాట్లాడుతూ.. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ప్రతి ఏడాదీ సెప్టెంబర్ ఐదున ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించుకుంటున్నట్లు చెప్పారు. రాధాకృష్ణన్ రాష్ట్రపతిగా దేశానికి ఎనలేని సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా శ్రీనివాసరావు

మండలంలోని ములక్కాయవలస మోడల్ పాఠశాల గణితం ఉపాధ్యాయుడు తెన్నేటి శ్రీనివాసరావు ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికయ్యారు. ఈ మేరకు పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు జగదీశ్వరి, విజయచంద్ర, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ చేతులమీదుగా శుక్రవారం అవార్డు అందుకున్నారు. దీంతో శ్రీనివాసరావును ప్రిన్సిపాల్ స్వర్ణలత , తదితరులు అభినందించారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి సన్మానం



బలిజిపేట: అప్పారావు మాస్టార్‌ను సన్మానిస్తున్న యువత

బలిజిపేట: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలంలోని పెదపెంకిలో విశ్రాంత ఉపాధ్యాయుడు కె. అప్పారావును స్థానిక యువత శుక్రవారం ఘనంగా సన్మానించింది. నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సన్మానగ్రహీత మాట్లాడుతూ..సమాజంలో ఉపాధ్యాయుడికి ఉన్నంత ఆదరణ మరెవరికీ ఉండదన్నారు. కార్యక్రమంలో పలువురు యువకులు పాల్గొన్నారు.



మక్కువ: ప్రజాప్రతినిధులు, అధికారులు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు

ఆలయాల మూసివేత రేపు

గరుగుబిల్లి: రాహుగ్రస్త చంద్రగ్రహణం కారణంగా మండలంలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి, కోదండరామస్వామి ఆలయాలను ఆదివారం మూసివేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వీవీ సూర్యనారాయణ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి ఆలయాలను మూసివేస్తామని, తిరిగి సోమవారం ఉదయం 9:30 గంటలకు ఆలయాలు తెరిచి స్వామి వారి పునఃదర్శనం భక్తులకు కలుగజేస్తామన్నారు.

అధ్వాన రహదారులతో అవస్థలు

- పట్టించుకోని అధికారులు, నాయకులు



అధ్వానంగా మారిన మిర్తివలస జంక్షన్ - అరసాడ రహదారి



వెంగాపురం నుంచి పదమాయవలస వెళ్లే రహదారిలో గోతులు

బలిజిపేట: మండలంలోని పలు ప్రధాన రహదారులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. అడుగుకో గుంత ఉండడంతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరడం వల్ల ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మిర్తివలస జంక్షన్ నుంచి అరసాడ వెళ్లే మార్గంలో పెద్ద పెద్ద గోతులేర్పడ్డాయి. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అదేవిధంగా వెంగాపురం నుంచి పదమాయవలస వెళ్లే రహదారి కూడా అధ్వానంగా తయారైంది. ఈ రహదారిపై ముఖ్యంగా రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బలిజిపేట నుంచి పలగర వెళ్లే రహదారిలో బలిజిపేట ఎస్సీ కాలనీ వద్ద గోతులతో అధ్వానంగా మారింది. అడుగుకో గుంత...గజానికో గొయ్యితో ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇటువంటి రోడ్లపై రాకపోకలు ఎలా సాగించాలని పలువురు ప్రశ్నిస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే రహదారులను అద్దంలా మెరిపిస్తామని చెప్పిన కూటమి నాయకులకు ఈ రోడ్లు కనిపించడం లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మరమ్మత్తులు చేపట్టండి..

మండలంలో పలు రహదారులు అధ్వానంగా ఉన్నాయి. వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలి. ప్రజలకు అవసరమైన రహదారుల సదుపాయాన్ని కల్పించలేకపోతే మరేమి సౌకర్యాలు కల్పిస్తారు. రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రధాన రహదారులను బాగు చేయాలి.

అప్పలస్వామి, పదమాయవలస

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పార్వతీపురం / సాలూరు
9010204441, 9951602891
Office mail : vzmadvt@gmail.com